తారాపద దే మరియు ఇతరులు
వర్సెస్
పశ్చిమ బెంగాల్ రాష్ట్రం

1951
జనవరి, 25.

[గౌరవ న్యాయమూర్తుల బెంచ్: గౌరవ ప్రధాన న్యాయమూర్తి శ్రీ హరిలాల్ కనియా, గౌరవ న్యాయమూర్తులు సయ్యద్ ఫజల్ అలీ, పతంజలి శాస్త్రి, ముఖర్జీయా, దాస్ మరియు చంద్రశేఖర అయ్యర్]

**భారత రాజ్యాంగం, 1950, ఆర్టికల్ 22(5)** – నివారక నిర్బంధం – వీలైనంత త్వరగా నిర్భందమునకు గల కారణాలను తెలుపవలసిన బాధ్యత – విన్నపము చేసుకోవడానికి వీలైనంత త్వరగా అవకాశం ఇవ్వవలసిన బాధ్యత - 15 రోజుల తర్వాత కారణాలను తెలుపడము - 4 నెలల తర్వాత “అనుబంధం కారణాలను” ను తెలుపడము – నిర్బంధము యొక్క చట్టబద్ధత - అస్పష్టమైన మరియు అసంబద్ధమైన కారణాలను వేరుపరచడము - మొదట కారణాలు, తరువాత వివరాలు, తెలుపడము – చట్టబద్ధత – ఒకే రోజున చాలా మంది వ్యక్తులకు, ముద్రిత ఉత్తర్వులను అందించడము – నిర్భంధము యొక్క ప్రామాణికత.

**బెంగాల్ క్రిమినల్ లా సవరణ చట్టము 1930** క్రింద చాలా మంది వ్యక్తులను నిర్బంధించడము జరిగినది. ఈ చట్టము యొక్క చెల్లుబాటు గురించి హైకోర్టు ముందు సవాలు చేయడమైనది. ఇంతలో, తేదీ. 26.02.1950 న **నివారక నిర్బంధం చట్టం 1950** ఆమోదించబడినది మరియు అదే రోజున ఈ చట్టము క్రింద నిర్భందపు ఉత్తర్వులను వారికి అందించడం జరిగినది. ప్రభుత్వము వారికి

మార్చి 14వ తేదీన, నిర్బంధం యొక్క కారణాలను అందించడము మరియు ఆ విధంగా మార్చి 14న వారికి అందించబడిన కారణాలకు కొనసాగింపుగా, జూలై 16వ తేదీన "అనుబంధ కారణాలు"ను గవర్నమెంటు అందించడమూ జరిగినది. జూలై 22 లేక 23వ తేదీలలో కారణాల యొక్క రెండవ కూర్పును అప్పీలుదారులకు అందించడమైనది. వివిధ కారణాలను చూపుతూ, నిర్బంధం యొక్క ఉత్తర్వులు చెల్లుబాటు కావన్న వాదనలతో, వారు హై కోర్టు ముందు బందీ ప్రత్యక్ష అదిలేఖ(హాబియస్ కార్పస్) రిట్(writ) కోసం దరఖాస్తు చేసుకొనడమైనది. హై కోర్టు ఆ దరఖాస్తులను నిరాకరించడము వలన, వారు సుప్రీం కోర్టు నకు అప్పీలు చేసుకున్నారు.

జనవరి 25, 1951 గౌరవ ప్రధాన న్యాయమూర్తి కనియా, గౌరవ న్యాయమూర్తులు ఫజల్ అలీ, ముఖర్జియా మరియు చంద్రశేఖర అయ్యర్ గార్లు ఇచ్చిన తీర్పు ప్రకారం - **(i)** ఈ కేసులోని ప్రత్యేకమైన పరిస్థితుల వలన, ముఖ్యముగా నిర్బంధ నివారక చట్టము **1950**వ సంవత్సరము ఫిబ్రవరిలో ఆమోదించబడిన తరువాత చాలా ఎక్కువ సంఖ్యలో కేసులతో వ్యవహరించవలసి వచ్చినందున 'వీలైనంత త్వరగా' అప్పీలుదారులకు కారణాలను తెలుపలేదనేది, ఆర్టికల్ 22(5) పరిధిలోనికి వస్తుందని చెప్పలేము.

**(ii)** కేవలము తదుపరి వివరాలను మరియు వాస్తవాలను అప్పీలుదారులకు జులై 16 మరియు 22 వ తేదీన తెలిపినారన్న కారణముతో మాత్రమే వారికి ఆర్టికల్ 22(5) క్రింద అవసరమైన విధముగా, విన్నపము చేసుకోవడానికి 'వీలైనంత త్వరగా అవకాశం'

ఇవ్వలేదు అని అభిప్రాయపడడానికి వీలులేదు. ఎందుకంటే, ఈ విధముగా తరువాత తెలిపిన విషయాలలో, మార్చి 14వ తేదీన ఇవ్వబడిన కారణాల శీర్షికల గురించిన వివరాలు మాత్రమే ఉన్నాయి. కానీ (వానిని) “అదనపు కారణాలు’ గా అభివ్యక్తీకరించినప్పటికీ, అందులో ఏ విధమైన నూతన లేక అదనపు కారణాలు చెప్పబడివుండలేదు. ;

**(iii)** కేవలము ఒక కారణము అస్పష్టంగా ఉన్నంత మాత్రాన, అది కారణమే కాదనియు మరియు అందువలన అది అధికారులను 'సంతృప్తిపరచడానికి' తగినది కాదనిదియు అనుకోవడానికి వీలులేదు; ఒక కారణము 'అస్పష్టమైనదై' ఉన్నందున దానికి ప్రభుత్వము యొక్క సంతృప్తితో ఏ మాత్రము సంబంధము కలిగి ఉండని ఒక అసంబద్ధమైన కారణముతో సరితూచలేము;

**(iv)** ప్రభుత్వము యొక్క సంతృప్తి కోసమై కారణాల యొక్క సమృద్ధిని గురించిన విషయము, కోర్టు ముందు పరీక్షించవలసినది కాదు; నిర్బంధములో ఉన్న వ్యక్తికి వీలైనంత త్వరగా విన్నపము చేసుకోవడానికి ఇచ్చిన అవకాశం గురించిన కారణాల సమృద్ధిని గురించి కోర్టు పరిశీలించవలసి ఉంటుంది కానీ, అది (ఆ పరిశీలన) ఆ కోణం నుండి మాత్రమే ఉండాలి.

న్యాయమూర్తి దాస్ గారు ఇచ్చిన తీర్పు ప్రకారం:– ప్రతి యొక్క నిర్బంధితుడి అనుమానాస్పద కార్యకలాపాలను గురించి అవగాహన ఏర్పరచుకుని, వారి యొక్క ప్రతికూల కార్యకలాపాలను నిరోధించడానికి వారిని నిర్బంధించడం అవసరమని, అధికారులు సంతృప్తి చెందడం జరిగి ఉండడం వలన, రాత్రికి రాత్రే పెద్ద పెద్ద

సంఖ్యలో నిర్బంధపు ఉత్తర్వులు ఇవ్వడమనేది, చెడు ఉద్దేశానికి సంకేతం కానేరదు.

*167వ పేజీలో (పైన చెప్పబడిన) - ది స్టేట్ ఆఫ్ బాంబే, **v.** ఆత్మ రామ్ శ్రీధర్ వైద్య ను అనుసరించడమైంది.*

క్రీమినల్ అప్పీల్ న్యాయనిర్ణయ అధికార పరిధి: (కేసు నం. **24/1950).** క్రిమినల్ మిగులు(మిస్స్లేనిఔస్) కేసు నెం. **361/1950** లో కలకత్తాలో ఉన్న హైకోర్టు ఆఫ్ జ్యూడికేచర్_యొక్క తీర్పును సవాలు చేస్తూ భారత రాజ్యాంగములోని ఆర్టికల్ **132 (1)** క్రింద దాఖలు చేయబడిన అప్పీలు.

అప్పీలుదారుల తరపున **A.C.** గుప్తా మరియు సుధాన్సు శేఖర్ ముఖర్జీ (వారితో పాటు అరుణ్ కుమార్ దత్తా మరియు **SN** ముఖర్జీ).

ప్రతివాది తరపున **M.C.** సెటల్వాడ్, అటార్నీ-జనరల్, (వారితో పాటు బి. సేన్).

గౌరవ ప్రధాన న్యాయమూర్తి సి.కనియా, గౌరవ న్యాయమూర్తులు సయ్యద్ ఫజల్ అలి, పతంజలి శాస్త్రి , ముఖర్జీయా, దాస్ మరియు చంద్రశేకర అయ్యర్ గార్లు ఇచ్చిన తీర్పు గౌరవ ప్రధాన న్యాయమూర్తి సి.కనియా, గారిచే వెలువరించబడినది. గౌరవ న్యాయమూర్తులు పతంజలిశాస్త్రి మరియు దాస్ లు వారి వారి ప్రత్యేకమైన తీర్పులను వెలువరించడమైనది.

గౌరవ ప్రధాన న్యాయమూర్తి సి.కనియా:- బందీ ప్రత్యక్ష అదిలేఖ (హాబియస్ కార్పస్) కోసం, అప్పీలుదారులు దాఖలు చేసుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తూ, కలకత్తాలోని హైకోర్టు ఇచ్చిన తీర్పు నుండి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 132 క్రింద వచ్చిన అప్పీలు ఇది. ఈ అన్ని కేసులలోనూ, నిర్బంధ నిరోధక చట్టము 1950 క్రింది ఉత్తర్వులను తేదీ 26.02.1950 న మరియు నిర్బంధానికి గల కారణములను తేదీ 14.03.1950 న అప్పీలుదారులకు అందించడం జరిగినది. మచ్చుకు వీనిలో ఒక దానిని మేము ఇక్కడ ఉదహరిస్తున్నాము:

"ఈ క్రింద చూపబడిన కారణముల వలన నిర్బంధ నిరోధక చట్టము 1950 (చట్టము IV/1950)లోని (3) సెక్షన్ యొక్క ఉప సెక్షన్(1) లోని అంశము (a)లోని ఉప అంశము (ii) కింద చేయబడిన నిర్బంధపు ఉత్తర్వులను అనుసరించి మీరు నిర్బంధించబడుచున్నారు:-

(1) మారణాయుధాలతో కూడిన దొమ్మీలు, దోపిడీలు, బందిపోటు దొంగతనాలు, దహనకాండలు మరియు హత్యలు చేయడాన్ని లక్ష్యముగా కలిగియుండి మరియు ఆయుధాలు, మందుగుండు సామాగ్రి మరియు పేలుడు పదార్థాలను (తమ) స్వాధీనములో కలిగి ఉండి, ప్రజా వ్యవస్థ నిర్వహణకు ప్రతికూలంగా వ్యవహరిస్తూ ఉండడం వలన, 'భారత క్రిమినల్ లా సవరణ చట్టము (చట్టము XIV/1908)లోని 16వ సెక్షన్ క్రింద, చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించబడిన భారత కమ్యూనిస్ట్ పార్టీ (మరియు) దానితోపాటు దాని (అనుబంధ) స్వచ్ఛంద సంస్థల యొక్క కార్యకలాపాలకు మీరు సహాయ పడుతూ

ఉన్నారు కనుక, మీ యొక్క అట్టి చర్యలను నిరోధించడం అవసరమై ఉన్నది.

(2) సిపిఐ యొక్క రైతు విభాగములో సభ్యులై ఉండి, మీరు హారా జిల్లాలోని రైతుల మధ్య సమస్యలను ప్రేరేపించినారు మరియు వారిని చట్టరహితమైన మరియు హింసాత్మకమైన చర్యలకు పురిగొల్పినారు:

ఇందువలన చట్ట వ్యవస్థ నిర్వహణకు ప్రతికూలమైన విధముగా వ్యవహరించినారు:

సిపిఐ కార్యకర్తగా, కలకత్తాలోని ట్రాముల వ్యవస్థలోని వ్యక్తులు మరియు ఇతర కార్మికుల మధ్య సమస్యలను మీరు ప్రేరేపించినారు మరియు విశ్వవిద్యాలయ హాలులోను మరియు ఇతర ప్రదేశాలలోను మీరు చేసిన ప్రసంగాల ద్వారా, వారిని హింసాత్మక మరియు చట్టరహిత చర్యలకు ప్రత్యక్షముగా పురిగొల్పినారు; మరియు తద్వారా ప్రజావ్యవస్థ నిర్వహణకు ప్రతికూలమైన విధముగా వ్యవహరించినారు."

వీరి నిర్బంధము గురించి "తేదీ 14.03.1950ననే అందించబడిన కారణాలకు కొనసాగింపుగా" తేదీ 16.07.1950 న పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అప్పీలుదారులకు అందించిన వానిలో మచ్చుకు ఒకటి ఈ క్రింది విధమైన అంశములతో ఉన్నది:-

"తేదీ 14.03.1950న ఇప్పటికే ఉత్తర్వు నం. 6163 H.S. కింద మీకు అందించబడిన కారణాలకు కొనసాగింపుగా, మీ నిర్బంధానికి గురించి ఈ క్రింద చెప్పబడిన అదనపు కారణాలు మీకు తెలుపబడుచున్నవి:-

బెంగాల్ చట్కర్ మజ్దూర్ యూనియన్ నకు సెక్రటరీగాను, ఫెడరేషన్ ఆఫ్ మర్కంటైల్ ఎంప్లాయీస్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగానూ, 'ఖాబర్' వార్తాపత్రిక (సిపిఐ యొక్క సంస్థ) యొక్క గౌరవ రిపోర్టర్గాను, మీరు సిపిఐ యొక్క విచ్ఛేదకరమైన కార్యక్రమాలను నిర్వహించారు. తేదీ 29.07.1948న హౌరాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసంతృప్తిని ప్రబోధిస్తూ మీరు ఇతరులతో కలిసి ఒక ఊరేగింపును నిర్వహించినారు, తద్వారా ప్రజావ్యవస్థ నిర్వహణకు మీరు ప్రతికూలమైన విధముగా వ్యవహరించినారు. ' మొదటి కారణాల వలెనే ఈ ‘అదనపు కారణాలు’ కూడా ప్రతి అప్పీలుదారునికీ ప్రత్యేకముగా అందించబడినవి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్లోని 491వ సెక్షన్ కింద అప్పీలుదారులు విడివిడిగా బందీ ప్రత్యక్ష అదిలేఖ (హేబియస్ కార్పస్ ) ఉత్తర్వు కోసం దరఖాస్తు చేసుకొనడమూ, మరియు తేదీ 21.07.1950న, ప్రతి కేసులోను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు సాపేక్ష ఉత్తర్వును జారీ చేయడమూ జరిగినది.”

“తేదీ 22 లేక 23 జూలై 1950 న కారణాల యొక్క రెండవ ప్రతిని అప్పీలుదారులకు అందించడము జరిగినది. మచ్చుకు వానిలో ఒకటి ఈ క్రింది విధముగా ఉన్నది:-

“ తేదీ 14.07.1950 నాటి ఉత్తర్వు నెం. 12820 క్రింద ఇప్పటికే అందించబడిన కారణములకు కొనసాగింపుగా మీ నిర్బంధమును గురించి తెలుపబడిన అదనపు కారణములు ఈ క్రింది విధముగా ఉన్నవి:

1. తేదీ 19.03.1947న శుభశకునాన కలకత్తా ట్రామ్వే వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, యూనివర్సిటీ ఇన్స్టిట్యూట్లో జరిగిన సమావేశంలో, తేదీ 20.03.1947న ట్రాములను బయటికి తీసే ప్రయత్నము జరిగితే అది విపత్తును ఆహ్వానించడమే అవుతుందని, మీరు బెదిరించడము మరియు అధికారులు ట్రాము సర్వీసును పునఃప్రారంభిస్తే, మీరు మీ స్నేహితులు ట్రాము లైన్లను తొలగించడానికి మరియు వైర్లను కత్తిరించడానికి సందేహించరని చెప్పడము జరిగినది.

2. తేదీ 13.06.1948న, (సిపిఐ నియంత్రణలో ఉన్న) స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఒక సమావేశానికి మీరు అధ్యక్షత వహించినారు, భారత కమ్యూనిస్ట్ పార్టీ మరియు దాని విభాగమైన ***స్వాధీనత*** పై ఉన్న నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని వాదిస్తూ ప్రసంగం చేసినారు." ఈ మొత్తం విషయాలను పరిశీలించిన తరువాత అప్పీలుదారుల దరఖాస్తులను హైకోర్టు తిరస్కరించడమూ, దానిమీదట అప్పీలుదారులు మా ముందుకు అప్పీలు ద్వారా రావడమూ జరిగినది. మార్చి 14 వ తేదీ నాటి కారణములను గూర్చిన సమాచారము, “వీలైనంత త్వరగా” ఇవ్వబడనందు వలన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 22 (5) కి అనుగుణంగా లేదని మొదటగా

అప్పీలుదారుల తరపున హై కోర్టు ముందు వాదించడము జరిగినది. ఈ వాదనను హైకోర్టు తిరస్కరించడమైంది. ఈ కేసు యొక్క పరిస్థితులను బట్టి మేము హై కోర్టుతో ఏకీభవిస్తున్నాము మరియు తేదీ 14.03.1950 నాడు కారణాలను అందించడములో, రాజ్యాంగములోని ఆర్టికల్ 22(5) లో పొందుపరచబడిన విధానాన్ని అనుసరించడములో అధికారులు విఫలమైనారన్న నిర్దేశనను ఇవ్వజాలకున్నాము.

**బెంగాల్ క్రిమినల్ లా అమెండ్మెంట్ యాక్ట్, 1930** క్రింద చాలా పెద్ద సంఖ్యలో వ్యక్తులను నిర్బంధించడం జరిగినది. ఆ చట్టం యొక్క చెల్లుబాటును హైకోర్టు ముందు సవాలు చేయడమూ జరిగినది మరియు దీనిని గూర్చిన తీర్పు 1950వ సంవత్సరము ఫిబ్రవరి చివరికి రావచ్చునన్న అంచనా ఉన్నది. భారత పార్లమెంటు 1950వ సంవత్సరము ఫిబ్రవరి చివరి వారములో **భారత నిర్భంధ నిరోధక చట్టము 1950** ను ఆమోదించడము జరిగినది మరియు తేదీ 26.02.1950 న నిర్బంధితులకు ఈ ఉత్తర్వులు అందించడమూ జరిగినది. అకస్మాత్తుగా రాష్ట్ర ప్రభుత్వము, చాలా సంఖ్య గల కేసులతో ఒకే ఒకరోజు వ్యవహరించవలసి వచ్చిందన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకొని, అప్పీలుదారుల యొక్క వాదనను మేము అంగీకరించలేకపోతున్నాము.

కారణాలను తెలుపడములో రాజ్యాంగంలోని ఆర్టికల్ 22 (5)నూ మరియు నిర్భంద నిరోధక చట్టములోని సెక్షన్ 7 క్రింద నూ పొందుపరచబడిన విధానాన్ని పాటించకపోవడము ఫలితముగా, వీలైనంత

త్వరగా తమ విన్నపాన్ని చేసుకోవడానికి తమకు ఉన్న హక్కును అప్పీలుదారులకు కల్పించలేకపోయినారు, అని అప్పీలుదారుల తరపున తరువాత వాదనను చేయడము జరిగినది. కేసు నెం.22/1950లో ఈ రోజు వెలువరించిన తీర్పు(పేజీ నెం167)లో ఆర్టికల్ 22(5) ప్రధానం చేస్తున్న రెండు హక్కుల యొక్క స్వభావాన్ని గురించి మేము వివరముగా చర్చించడము జరిగినది. ఈ అప్పీలులో ఒక నిర్ణయానికి రావడము కోసం దీనిలోని వాస్తవాలకు ఈ సూత్రాలకు మేము అన్వయించాల్సిన అవసరం ఉంది.

తేదీ 16.07.1950 న అధికారులు రెండవ సమాచారాన్ని అప్పీలుదారులకు అందించినప్పుడు, వారు దానిని "ఇంతకుముందే పంపించిన కారణాలకు కొనసాగింపుగా" అనియు మరియు "నిర్బంధానికి గల అదనపు కారణములు" అనియు అభివర్ణించినారు. ఈ సమాచారములోని పదజాలముపై ఆధారపడి, ఇవి బందితులకు అందించబడిన అదనపు కారణాలు అనియూ, మరియు అందువలన ఆర్టికల్ 22 (5) లో పొందుపరచబడిన విధానాన్ని అనుసరించబడలేదనియూ, వాదించడం జరిగినది. "వీలైనంత త్వరగా " కారణాలను అందించాలనే బాధ్యత నిర్ధిష్టమైనది అని కూడా వాదించడమైనది. నిర్భందపు ఉత్తర్వు ఇవ్వవల్సిన అవసరం ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం సంతృప్తి చెందడానికి, నిర్భందపు కారణాలు వారి ముందు ఉండవల్సిన అవసరం ఉన్నది.

తేదీ 26.02.1950న నిర్బంధించిన అధికారుల ముందు ఉన్న కారణాలు, మార్చి 14వ తేదీన వారు అందించినవి మాత్రమే అయి ఉంటే, వారి ముందు, ఆ రోజు లేని మరియు నాలుగు నెలల తరువాత మాత్రమే వారు అందించిన అదనపు కారణాలు, నిర్బంధాన్ని బలపరచలేము. ఈ సమాచారము చూపే వాస్తవాన్ని బట్టి, మొదటి కారణాలతో అధికారులు సంతృప్తి చెందలేదనియూ మరియు అందువలననే పరాలోచన పూర్వకముగా వారు అదనపు కారణాలను ముందుకు తెచ్చినారనియూ కూడా వాదించడము జరిగినది. మా అభిప్రాయం ప్రకారం, ఈ వాదనలు అంగీకారయోగ్యము కావు. రెండవ సమాచారములోని విషయాలను 'అదనపు కారణాలు' అని అభివర్ణించినంత మాత్రాన, అవి అదనపు లేదా కొత్త కారణాలు అవవలసిన అవసరం లేదు. కేసు నెం. 22/1950 (***167వ పేజీ లో (పైన చెప్పబడిన))*** లో మేము ఇచ్చిన తీర్పులో వివరించిన విధముగా, అవి కొత్త కారణాలా అని తెలుసుకోవడానికి (సమాచారములోని) అంశాలను పరిశీలించవలసి ఉంటుంది. ఆ విధముగా తరువాతి సమాచారములోని అంశాలను పరిశీలించినప్పుడు, అవి తేదీ 14.03.1950న ఆయా అప్పీలుదారులకు, వారి వారి కార్యకలాపాల గురించి అందింపబడిన కారణాలలోని ఉప శీర్షికల వివరాలు మాత్రమే తెలుపుతున్నాయని మేము కనుగొనడం జరిగినది. మేము వీనిని కొత్త కారణాలుగా పరిగణించలేము మరియు ఇవి తాజా లేక కొత్త కారణాలు కావని హై కోర్టు ఇచ్చిన నిర్ధారణతో మేము ఏకీభవిస్తున్నాము. ఈ సమాచారము యొక్క నిజమైన ప్రభావాన్ని కేవలము దీని శీర్షికలోని (opening words) పదాలని మాత్రమే చదివి నిర్ధారించలేము. దీన్ని

(సమాచారము) మొత్తాన్ని చదివి, అంతటినీ కలిపి పరిగణించవలసి ఉంటుంది. మొదటి కారణాలతో సంతృప్తి చెందలేకపోయినందున, అధికారులు ఈ సమాచారాన్ని అదనపు కారణాలుగా ముందుకు తెచ్చినారన్న వాదన కూడా పటుత్వము లేనిదే. ఈ వివరాలు తరువాత అందిచబడినవన్న వాస్తవం వలన, అవి మార్చి 14 వ తేదీ నాటి సమాచారము పంపే సమయానికి అధికారులకు తెలిసి ఉండవని అనుకోనవసరము లేదు.

కేసు నెం.22/1950లో మేము ఇచ్చిన తీర్పులోని సూత్రాల దృష్ట్యా, తేదీ 16.07.1950నాటి సమాచారము “వీలైనంత త్వరగా” ఇచ్చినది కాదన్న వాదనను నిరాకరించాల్సి ఉంటుంది. ప్రతి కేసులోని వాస్తవాలను పరిగణలోనికి తీసుకోవల్సి ఉంటుంది మరియు ఆర్టికల్ 22 (5) లో పొందుపరచబడిన ఈ విభాగాన్ని అనుసరించలేదని నిర్భందించిన వ్యక్తి వాదించినట్లైతే, ఈ వాదనను ఖండించడానికి అవసరమైన వివరాలను అధికారులు (కోర్టు ముందు) ఉంచవలసి ఉంటుంది. ఈ కేసులో ఈ చట్ట విధాన ఉల్లంఘన జరగలేదని హైకోర్టు భావించడం జరిగినది మరియు మేము వేరే నిర్ణయానికి రావడానికి ఎటువంటి కారణాలు కనిపించడం లేదు.

కారణాలు అస్పష్టంగా ఉండడం వలన, అవి అధికారులను "సంతృప్తిపరచడానికి" తగినవి కానే కావని మరొక వాదనను చేయడం జరిగినది. ఈ విషయంగా మేము కేసు నెం. 22/1950 లో ఇచ్చిన తీర్పులో చెప్పిన దానికి అదనముగా చెప్పడానికి ఏమీ లేదు. " అస్పష్టమైన

కారణాలు"ను "అసమంజసమైన కారణాలు"తో సమానంగా చూడవలసి ఉంటుందన్న వాదనను మేము అంగీకరించలేకపోతున్నాము. నిర్బంధపు ఉత్తర్వును జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం యొక్క సంతృప్తితో, అసమంజసపు కారణానికి ఎటువంటి సంబంధం లేదు. కారణాలు అస్పష్టమైనప్పుడు, నిర్భంధ నిరోధక చట్టములోని 3వ సెక్షన్ నకు అవసరమైన విధముగా, అధికారులు సంతృప్తి చెందడానికి అవకాశము లేనందున, విన్నపము చేసుకోవడానికి వీలు ఉండదన్న వాదనను కూడా, పైన చెప్పిన తీర్పులలోని కారణాల వలన మేము అంగీకరించలేకపోతున్నాము. రాష్ట్ర ప్రభుత్వానికి సంతృప్తి కలిగించేందుకు తగినంత కారణాలు(ఉన్నాయా) అనేది కోర్టు పరిశీలించవలసిన విషయము కాదు. నిర్బంధించబడిన వ్యక్తికి వీలైనంత త్వరలో విన్నపము చేసుకోవడానికి తగినంత కారణాలు ఉన్నాయా అన్నది, ఆ కోణములోనుంచి మాత్రమే కోర్టు పరిశీలించదగిన విషయము, అందువలన ఈ రెండు పరీక్షలకు కారణాల యొక్క గుణాలు మరియు స్వాభావిక లక్షణాలు ఒకటే అయి ఉండాలన్న వాదనను, మేము అంగీకరించలేకపోతున్నాము. సంతృప్తి విషయంగా తరచుగా చెప్పబడుతున్నట్లుగా, ఒకే కారణాల వలన ఒక వ్యక్తి సంతృప్తి చెందవచ్చు మరొక వ్యక్తి చెందకపోవచ్చు. చట్టంలో ఉపయోగించబడిన పదావళి బట్టి, ఈ విషయము కోర్టు నిర్ణయించవలసినది కాదు. ఆర్టికల్ 22(5) క్రింద, విచారణలోని రెండవ భాగము స్పష్టంగా కోర్టు పరిధిలోనికి వస్తున్నది. అందువలన కారణాలు, విన్నపము చేయడానికి సరిపోయినవి మరియు తగినవి

కానట్లైతే, ఆ కారణాలు ఆధికారుల స్వీయ సంతృప్తికి కూడా సరిపోవన్న వాదనతో మేము ఏకీభవించలేము.

మొదటి సమాచారములో, ప్రతి కేసులో ప్రభుత్వం అందించిన కారణాలకు సంబంధించి, మొదటి కారణము అప్పీలుదారులందరికీ ఒకటే అయి ఉన్నదనియు రెండవ కారణం చాలా కేసులలో భిన్నంగా ఉందనియు, గమనించడమనేది తగిన విషయము. ప్రతి అప్పీలుదారుని కేసులోను, తేదీ 14.03.1950న అతనికి పంపిన సమాచారము గురించి హైకోర్టు పరిశీలించడము జరిగినది. వారి అభిప్రాయం ప్రకారం ఆ కారణాలు అస్పష్టమైనవి కావు. మార్చి 14వ తేదీనను మరియు తరువాత జూలైలోను అప్పీలుదారులకు అందించబడిన కారణాల వలన, నిర్బంధంలో ఉన్న వ్యక్తికి వీలైనంత త్వరగా విన్నపము చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలన్న విధానపరమైన వెసులుబాటు ఉల్లంఘించబడలేదని, వారు (హై కోర్టు) నిర్ధారించడము జరిగినది. ఈ అంశము గురించి మా ముందు గట్టిగా వాదన చేయబడలేదు. అప్పీలుదారు తరఫు న్యాయవాది వాదన విన్న తర్వాత, ఈ విషయముగా హైకోర్టు చేసిన నిర్ధారణతో విభేదించవలసిన అవసరం మాకు కనిపించడం లేదు. ఫలితంగా అప్పీలు విఫలమైనది మరియు త్రోసిపుచ్చబడినది.

**న్యాయమూర్తి పతంజలిశాస్త్రి-** ప్రధాన అంశము ఒకటే అయినందున ఈ అప్పీలు ను కేసు నెం.22/1950 ((**ది స్టేట్ ఆఫ్ బాంబే వర్సెస్ ఆత్మారాం శ్రీధర్ వైద్య**) (*పైన చెప్పబడిన 167వ పేజీ లో*) తో పాటు వినడం జరిగినది. ఆ కేసులో నేను వెలువరించిన తీర్పులో ఆ అంశం

పై నేను స్పష్టం చేసిన అభిప్రాయం ప్రకారం, ఈ అప్పీలు ఆమోదింపబడజాలనిది కావున, ఇది త్రోసిపుచబడవలయును అన్న విషయముతో నేను ఏకీభవిస్తున్నాను.

**న్యాయమూర్తి దాస్.**—ఇప్పుడే, తీర్పు వెలువరించబడిన స్టేట్ ఆఫ్ బాంబే కేసులో అప్పీలులోని నిర్భందితుడు లేవనెత్తిన ముఖ్యమైన అంశాలనే, ఈ కేసులోని 100 మంది నిర్బంధితులు కలకత్తా హైకోర్టు బెంచ్ యొక్క ఆదేశానికి వ్యతిరేకంగా లేవనెత్తడము జరిగినది. అధికారులు ప్రతి కేసులోను విస్తృతమైన మనోనువర్తనను చేయజాలక పోయి ఉండడము వలన, రాత్రికిరాత్రే పెద్ద సంఖ్యలో తాజా నిర్బంధపు ఉత్తర్వులను జారీ చేయడమనేది, వారి యొక్క దురాలోచనను స్పష్ట పరుస్తున్నది అన్నది, ఈ అప్పీలులో లేవనెత్తబడిన ఒక అదనపు అంశము. ఈ వాదన సరియైనదని నేను అంగీకరించలేకపోతున్నాను. స్థానిక చట్టాల క్రింద, నిర్బంధితులకు నిర్బంధపు ఉత్తర్వులు జారీ చేసేటప్పుడు, ప్రతి ఒక్కరి అనుమానాస్పద చర్యల గురించి అధికారులు తగినంతగా మనోనువర్తనను చేసియుండి, వారిని ఆయా ప్రతికూల చర్యలను చేయకుండా నిరోధించడం కోసము, వారి యొక్క నిర్బంధము అవసరమని సంతృప్తి చెందడము జరిగినది. స్థానిక చట్టాలు యొక్క చట్టబద్దత గురించి అనుమానం ఉన్నందువలన మరియు ఈ లోపల నిర్బంధ నిరోధక చట్టము ఆమోదింపబడినందున, కొత్త చట్టం క్రింద తాజా ఉత్తర్వులను జారీ చేయడమనే అంశము వచ్చినది. అప్పటికే నిర్బంధపు ఉత్తర్వులను ఇవ్వవలసిన ఆవశ్యకత ఉన్నదన్న నిర్ణయానికి అధికారులు వచ్చి

ఉన్నందున, ప్రస్తుతము ప్రతిపాదిస్తున్న విస్తృత మనోనువర్తన అవసరం లేదని, నాకు అనిపిస్తున్నది. అధికారుల యొక్క దురాలోచనను నిర్ధారించే విధముగా వారి యొక్క విధి నిర్వాహణ వైఫల్యం ఏదైనా ఉన్నదని, నేను భావించడము లేదు. నా ఉద్దేశము ప్రకారము, ఇంకో అప్పీల్లో నేను ఇచ్చిన తీర్పులో చెప్పిన కారణాల రీత్యా, అధికారులకు ఏ విధమైన దురుద్దేశ్యము ఉన్నట్లుగా రుజువు కాబడనందున, దరఖాస్తుదారుల యొక్క ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగియుండలేదు. ఉమ్మడి కారణాలు కాక, ప్రతి ఒక్క నిర్బంధితుని కేసులోను నిర్బంధానికి గాను ఒకటి లేక అంతకంటే ఎక్కువ ప్రత్యేక కారణాలు ఉండడము వలన, ఆ సంబంధిత నిర్బంధితుడు విన్నపము చేసుకోవడానికి అవి అవసరమైన దాని కంటే ఎక్కువగానే ఉన్నవి. అందువలన, అదనపు కారణాలు అన్న అంశమే తలెత్తదు. నా అభిప్రాయం ప్రకారం, న్యాయమూర్తి Roxburgh చేసిన నిర్ధారణలు సరైనవి మరియు నిర్ధిష్టమైనవి, మరియు ఇందువలన ఈ అప్పీల్ని త్రోసిపుచ్చవలయును.

అప్పీల్ త్రోసిపుచ్చడమైనది.

అప్పీలుదారుని యొక్క ఏజెంట్: PK ఛటర్జీ.

ప్రతివాదిదారుని యొక్క ఏజెంట్: PK బోస్.